నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 28 | ఆదివారం, 27 జూన్ 2026 | పేజీలు - 8 | వెల : 3/-




## తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా..ముగ్గురు సీఎంలు చీకటి ఒప్పందాలు



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు.

## భారత పర్యటనకు ట్రంప్

త్వరలో ఖరారు కానున్న ట్రేడ్ డీల్

భారత్, అమెరికా మధ్య అనుబంధం

అమెరికా విదేశాంగ మంత్రి రూబియో



**వాస్తవ తెలంగాణ** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించనున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. భారత్‌అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమని కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసే లోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకర మన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్‌అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు.

## యాంజియోజెట్ విధానంతో 'టీవీటీ'కి చెక్



**వాస్తవ తెలంగాణ** హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వాస్క్యులర్ సర్జరీ విభాగం వైద్యులు అత్యాధునిక యాంజియోజెట్ పార్మాకో–మెకానికల్ థ్రోంబెక్టమీ విధానాన్ని సక్సెస్‌గా వినియోగించారు. అక్యూట్ డీప్ వియన్ త్రంబోసిస్ తో బాధపడుతున్న రోగికి విజయవంతంగా చికిత్స అందించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం, బయ్యారం గ్రామానికి చెందిన 39 ఏండ్ల కొలిచేల్మి రజినీకి ఈ అత్యాధునిక చికిత్సను నిమ్స్‌లో తొలిసారిగా నిర్వహించారు. డీప్ వియన్ త్రంబోసిస్ అనేది కాళ్లలోని లోతైన సిరల్లో రక్తం గడ్డకట్టే తీవ్రమైన వ్యాధి. సకాలంలో చికిత్స అందించకపోతే ఆ గడ్డ ఊపిరితిత్తులకు చేరి పల్మనరీ ఎంబాలిజంకు దారితీసి ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ఈ చికిత్సలో ఉపయోగించిన యాంజియోజెట్ పార్మాకో–మెకానికల్ థ్రోంబెక్టమీ పద్ధతిలో ముందుగా రక్తం గడ్డను కరిగించే ప్రత్యేక ఔషధాలను నేరుగా ఆ ప్రాంతంలో ప్రవేశపెట్టి, అనంతరం యాంజియోజెట్ పరికరం సహాయంతో ఆ గడ్డను వేగంగా తొలగిస్తారు. దీనివల్ల రక్తప్రసరణ తక్షణమే పునరుద్ధరించ డటంతోపాటు రోగి త్వరగా కోలుకునే అవకాశం పెరుగుతుంది. అలాగే భవిష్యత్‌లో కాళ్ల వాపు, నొప్పి వంటి దీర్ఘకాలిక సమస్యలు వచ్చే ప్రమాదం కూడా గణనీయంగా తగ్గుతుంది.

స్పెషల్ స్టోరీ



## పెట్టుబడులకు.. ఎత్తుగడలు!

### విదేశీ కంపెనీలకు రెడ్ కార్పెట్

### హైదరాబాద్‌లో డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ

ప్రత్యేకంగా నామకరణం చేసిన ప్రభుత్వం

అంతర్జాతీయంగా కంపెనీల దృష్టిని ఆకట్టుకునే యత్నాలు

విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేలా చర్యలు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ముందస్తు వ్యూహం

ప్రపంచ పెట్టుబడిదారులను ఆకట్టుకునే ప్రతిపాదనలు

శిలాఫలకం ఆవిష్కరించిన ఉపముఖ్యమంత్రి భట్టి

ట్రూత్ సోషల్‌లో సంతోషం వ్యక్తం చేసిన ట్రంప్

3




విదేశీ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ తెలంగాణ ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రపంచ పెట్టుబడిదారులను ఆకట్టుకునేందుకు సరికొత్త ప్రతిపాదనలు చేస్తోంది. ఈ మధ్య హైదరాబాద్‌లోని ఓ రోడ్డుకు యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నామకరణం చేయడం, దానికి సంబంధించిన శిలాఫలకాన్ని గ్రాండ్‌గా ప్రారంభించడం దీనిలో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అయితే.. డిసెంబర్‌లో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం రేవంత్ రెడ్డి సర్కారు విదేశీ పెట్టుబడిదారులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్‌కు ఆనుకొని ఉన్న ఒక ప్రధాన రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేసింది. ఈ నెల 23న ప్రత్యేక కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ నిర్ణయం వెనుక కొన్ని వ్యూహాత్మక అంశాలు ఉన్నట్టు తెలుస్తోంది. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించి, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం ఈ పేరు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా సమాచారం. డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ముందు ప్రపంచ పెట్టుబడి దారుల దృష్టిని తిప్పుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందని పరిశీలకులు భావిస్తున్నారు. అందుకు ఈ ప్రతిపాదన ఆమోదించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రకటించారు. అమెరికా సంస్థలతో నిండిపోయిన హైదరాబాద్ నగరాన్ని 'సైబరాబాద్' అని కూడా పిలుస్తారు. అందుకే అమెరికా అధ్యక్షుడి పేరును ఈ రోడ్డుకు పెట్టినట్టు తెలుస్తోంది.

**వాస్తవ తెలంగాణ**

## 28 నుంచి నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటన

**హైదరాబాద్:వాస్తవ తెలంగాణ** తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ మూడు రోజులు రాష్ట్రంలో పర్యటిస్తారని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్ష?్నలు ఎన్ రామచందర్‌రావు తెలిపారు. శుక్రవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాల యంలో జరిగిన విలేకరుల సమావే శంలో జనరల్ సెక్రెటరీ వీరేందర్ గౌడ్, కోశాధికారి దేవకి వాసుదే వరావు, రాష్ట్ర మీడియా ఇంచార్జ్ అండ్ చీఫ్ స్పోక్స్ పర్సన్ ఎన్వీ సుభాష్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. నితిన్ నబీన్ ఈనెల 28న శంషాబాద్ చేరుకుని, అక్కడి రంగారెడ్డి జిల్లా కార్యాలయం నుంచి రాష్ట్రంలోని పది జిల్లాల పార్టీ నూతన కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని బూత్ అధ్యక్షుల భారీ సమావేశంలో పాల్గొని, ఆ తర్వాత రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా భేటీ అవుతారని వివరించారు. 29వ తేదీ ఉదయం విజ్ఞాన భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీబీఐటీ) ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థులతో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారనీ, ఆ తర్వాత వరంగల్ వెళ్లే మార్గంలో భువనగిరిలో ఘనస్వాగతం అందుకుని, వరంగల్‌లో లంబాడ, కోయ, చెంచు, గోండు వంటి వివిధ ఆదివాసీ, గిరిజన తెగల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా బూత్ ప్రెసిడెంట్స్ సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. 30వ తేదీ ఘట్‌కేసర్‌లో జరిగే రాష్ట్ర కార్యవర్గ (స్టేట్ వర్కింగ్ కమిటీ) మరియు ఆఫీస్ బేరర్స్ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేసి,మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్తారని వివరించారు. ఈ పర్యటన పూర్తిగా పార్టీ సంస్థాగత బలోపేతానికి ఉద్దేశించినదే తప్ప ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. స్వాగతిస్తున్నాం



తుంగభద్ర నది గేట్లకు మరమ్మతులు చేయాలనే నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని రాంచందర్‌రావు తెలిపారు. **(మిగతా 2లో..)**

## రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనలో రామకృష్ణారావు రికార్డు



**వాస్తవ తెలంగాణ** రామకృష్ణారావు.. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. ఈనెల 30న పదవీ విరమణ చేయబోతున్న ఈ సీనియర్ ఐఏఎస్, రాష్ట్ర చరిత్రలోనే ఒక రికార్డు నెలకొల్పారు. గతంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేసిన ఈయన... తెలంగాణ బడ్జెట్ రూపకల్పనలో రికార్డు సృష్టించారు. మొత్తం 14 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను తయారు చేసిన ఐఏఎస్ అధికారిగా పేరుగాంచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనూ ఇన్నిసార్లు బడ్జెట్‌ను రూపకల్పన చేసిన అధికారి ఎవరూ లేకపోవడం గమనార్హం. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ వి నాగిరెడ్డి అత్యధికంగా 12 సార్లు బడ్జెట్‌ను రూపొందించారు. కాగా 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు 12 పూర్తిస్థాయి బడ్జెట్లు, రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లను రూపొందించారు. తెలంగాణ ఏర్పడిన కొద్ది కాలానికి ఆయన ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ తర్వాత ఆ శాఖలోనే ముఖ్యకార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు తొమ్మిదేండ్లు ఆర్థిక శాఖ బాధ్యతలను నిర్వర్తించి రాష్ట్ర బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనే బడ్జెట్‌ను తయారు చేయడం గమనార్హం. గతేడాది ఏప్రిల్ 30న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా కె రామకృష్ణారావు నియమితులయ్యారు. రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, ఫ్లాగ్‌షిప్ పథకాలకు నిధులు, ఆర్థిక వ్యవస్థల్లో పారదర్శకత పెంచడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల రెండింటి లోనూ ఆర్థిక శాఖకు ఆయన నేతృత్వం వహించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా పలు బడ్జెట్లను రూపొందించిన రామకృష్ణారావు... కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన వెంటనే అదే బడ్జెట్లపై శ్వేతపత్రం తయారు చేయటం గమనార్హం. ఈనెల 30న ఆయన ఉద్యోగ విరమణ పొందనున్న ఆయనకు ఆర్థిక రంగంలో ఉన్న అపార అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారుగా నియమించారు.

# ఓటరు సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

**బీఎల్‌వోలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్‌రెడ్డి**





**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఓటరు సర్వేలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని, బీఎల్‌వోలకు అవసరమైన వివరాలు అందించి పూర్తి సహకారం అందించాలని మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.హవేలీ ఘన్‌పూర్ మండలం కూచన్‌పల్లి గ్రామ శివారులోని తన నివాసానికి శనివారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు వచ్చి ఓటరు సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను సేకరించి, ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా జరుగుతున్న సర్వేలో ప్రతి ఓటరు పాల్గొనాలని, బీఎల్‌వోలకు అవసరమైన సమాచారాన్ని సక్రమంగా అందించాలని కోరారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ (సార్) సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పార్టీ తరఫున బీఎల్ఏలు అందుబాటులో ఉన్నారని, సందేహాలు ఉంటే వారిని సంప్రదించాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# బీజేపీ పార్టీ పటిష్టం కోసం కృషి చేస్తా ఓబీసీ అధ్యక్షులు కోణం విట్టల్



**నారాయణ్ ఖేడ్ వాస్తవ తెలంగాణ** భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా పెద్ద శంకరంపేట మండల పరిధిలోని టింకటి గ్రామానికి చెందిన కోణం విఠల్ నియామకం అయ్యారు. శనివారం నూతనంగా నూతనంగా సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన కోణం విఠల్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు,కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి. సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.జిల్లాలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓబిసి జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్ రావు,రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార పత్రి రామకృష్ణ బిజెవైఎమ్ అధ్యక్షుడు బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: డీఈవో రాజు








**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రాజు అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శనివారం మెదక్ పట్టణంలో నిర్వహించిన "డ్రగ్ అబ్యూజ్ అవేర్‌నెస్" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటికి దూరంగా ఉండే మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. "డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యం ముద్దు" అనే నినాదాలతో విద్యార్థులు సమాజానికి సందేశం ఇచ్చారు.ఈకార్యక్రమంలో పట్టణ సీఐ. మహేష్, బీఎస్‌జీ ఎస్‌ఓసీ వెంకటేశ్వర్లు, జిల్లా జనరల్ సెక్రటరీ ఇప్ప రాజేందర్, జాయింట్ సెక్రటరీ లతీఫ, డీఓసీలు తలారి నాగరాజు, బట్టి జ్యోత్స్న, డీటీసీలు మహిపాల్, కమల, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు, స్కౌట్ విద్యార్థులు, గైడ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# గ్రామంలో నేడే చిన్నారులకు పోలియో చుక్కలు ఉపసర్పంచ్ రవికుమార్



**వాస్తవ తెలంగాణ న్యూస్ పుల్కల్** నేడు జరిగే పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేల చూడాలని అంగన్వాడి టీచర్లు ఏ.ఎన్.ఎం .ఆశా వర్కర్లకు ఉపసర్పంచ్ రవికుమార్ ఆదేశించారు .నేటి నుండి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి గ్రామంలో 0.5 సంవత్సరాల వయసు గల ప్రతి చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అంగన్వాడీ టీచర్లు. ఏఎన్ఎం .ఆశా వర్కర్ చూడాలని ఆయన అన్నారు. గ్రామంలో ఏ ఒక్క చిన్నారీ మిగిలిపోకుండా వార్డ్ సభ్యులు వార్డుల వారీగా ప్రజల వద్దకు వెళ్లి ఆయా వార్డుల్లో ఉన్న చిన్నారులను పోలియో కేంద్రానికి పంపించే బాధ్యత వార్డ్ సభ్యులు తీసుకోవాలని అవసరమైతే ఆ చిన్నారులను పోలియో కేంద్రానికి తీసుకువచ్చే బాధ్యత మనం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ -- 6,240 కుటుంబాల విద్యా శాఖ కు విజ్ఞప్తి..









**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా నాగారం డివిజన్ రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ (వీరాా) మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్వహించబడింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు పాఠశాలను ప్రారంభించలేదు. జిల్లా విద్యాశాఖ అధికారి (ఐజూా) మరియు మండల విద్యాశాఖ అధికారి (వీజూా) మారినప్పటి నుంచి కూడా ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు.దీంతో చిన్నారులు పాఠశాలకు వెళ్లకుండా రోడ్లపై తిరుగుతూ తమ విలువైన విద్యా సమయాన్ని కోల్పోతున్నారు. ఇది పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.మా రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సుమారు 6,240 కుటుంబాలు నివసిస్తున్నారు. వీరిలో అధిక శాతం కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడినవే. తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే ఆర్థిక స్థోమత వారికి లేదు. ప్రభుత్వ పాఠశాలే వారి పిల్లల విద్యకు ప్రధాన ఆధారం. అందువల్ల ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ అధికారులు మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, (వీరాా )మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను తక్షణమే ప్రారంభించి, అవసరమైన ఉపాధ్యాయులు, సిబ్బంది, బెంచీలు, డెస్కులు మరియు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించి, మా పిల్లల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రజలందరూ ఆశతో ఎదురుచూస్తున్నారు. అని తెలంగాణ రాంపల్లి 2 బి హెచ్ కే.దేవాలయ కమిటీ సభ్యులు కోరుతూ సంబంధిత అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమం లో సంరక్షకులు: మోహన్ ప్రసాద్ రెడ్డి బాబాయి చైర్మన్: వెంకట్ జనరల్ సెక్రటరీ: కాంపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లోని లక్ష్మీనారాయణ కాలనీ లో 90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు..

**---పనులను పరిశీలించినా రజిత పరమేశ్వర్ రెడ్డి.**





**ఉప్పల్ నియోజకవర్గం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం మాజీ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి దృష్టికి ఇటీవల కాలనీలవాసులు రోడ్డు సమస్యలను తెచ్చారు. దీనిపై స్పందించిన మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు. శనివారం సీసీ రోడ్డు పనులను ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లక్ష్మీనారాయణ కాలనీ అధ్యక్షుడు లూకాస్, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మురళి రెడ్డి, నాగరాజు, సుధాకర్, హరి, అశోక్ గౌడ్, నిరంజన్, నాగేశ్వరరావు, రవి వర్మ, దుర్గాప్రసాద్, రామారావు, వల్లూరి శీను, అచ్చిరెడ్డి, పెద్ద ప్రసాద్, చిన్న ప్రసాద్, మధుబాబు, పరమేష్, మీసాల రాములు, బ్రహ్మచారి, బిక్షపతి, నరసింహ చారి, శ్రీహరి చారి, పాండురంగాచారి, రాజు, కృష్ణ, మోహన్ బాబు, నాగేష్, ఇస్మాయిల్, ఖాదర్ వల్లి, మదర్, భాస్కర్ దాస్, వేణు, వెంకటేష్, సిహెచ్ కుమార్, నాగేశ్వరరావు, సి సి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సందీప్, భాస్కర్, మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.






# పెట్టుబడులకు.. ఎత్తుగడలు!

## విదేశీ కంపెనీలకు రెడ్ కార్పెట్

- హైదరాబాద్‌లో డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ
- ప్రత్యేకంగా నామకరణం చేసిన ప్రభుత్వం
- అంతర్జాతీయంగా కంపెనీల దృష్టిని ఆకట్టుకునే యత్నాలు
- విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేలా చర్యలు
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ముందస్తు వ్యూహం
- ప్రపంచ పెట్టుబడిదారులను ఆకట్టుకునే ప్రతిపాదనలు
- శిలాఫలకం ఆవిష్కరించిన ఉపముఖ్యమంత్రి భట్టి
- ట్రూత్ సోషల్‌లో సంతోషం వ్యక్తం చేసిన ట్రంప్

విదేశీ కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసేలా తెలంగాణ ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రపంచ పెట్టుబడిదారులను ఆకట్టుకునేందుకు సరికొత్త ప్రతిపాదనలు చేస్తోంది. ఈ మధ్య హైదరాబాద్‌లోని ఓ రోడ్డుకు యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నామకరణం చేయడం, దానికి సంబంధించిన శిలాఫలకాన్ని గ్రాండ్‌గా ప్రారంభించడం దీనిలో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అయితే.. డిసెంబర్‌లో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం రేవంత్ రెడ్డి సర్కారు విదేశీ పెట్టుబడిదారులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్‌కు ఆనుకొని ఉన్న ఒక ప్రధాన రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేసింది. ఈ నెల 23న ప్రత్యేకకార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ నిర్ణయం వెనుక కొన్ని వ్యూహాత్మక అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించి, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం ఈ పేరు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా సమాచారం. డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ముందు ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని తిప్పుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందని పరిశీలకులు భావిస్తున్నారు. అందుకు ఈ ప్రతిపాదన ఆమోదించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రకటించారు. అమెరికా సంస్థలతో నిండిపోయిన హైదరాబాద్ నగరాన్ని 'సైబరాబాద్' అని కూడా పిలుస్తారు. అందుకే అమెరికా అధ్యక్షుడి పేరును ఈ రోడ్డుకు పెట్టినట్లు తెలుస్తోంది.




### సంతోషం వ్యక్తం చేసిన ట్రంప్..

ట్రూత్ సోషల్ వేదికగా అమెరికా అగ్రనేత ఇలా రాసుకొచ్చారు.. భారత దేశంలోని హైదరాబాద్‌లో 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని కొత్తగా పేరు పెట్టారు. నాకు ఇలాంటి గౌరవం దక్కడం చాలా ఆనందంగా ఉంది, ధన్యవాదాలు. ఇలా గౌరవించబడిన మొదటి అమెరికా అధ్యక్షుడిని నేనే అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఈ రోడ్డుకు పేరు పెట్టే కార్యక్రమంలో అమెరికా రాయబారి సెర్గియో, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొని, డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ శిలాఫలకాన్ని లాంఛనప్రాయంగా ఆవిష్కరించారు.

### శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఉపముఖ్యమంత్రి భట్టి..

అమెరికా 'ఫ్రీడం 250' వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఈ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీనికి సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కార్యక్రమంలో సీనియర్ దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులు, రక్షణ, ఏరోస్పేస్ రంగాల నాయకులు పాల్గొని, అమెరికా-భారత్ బంధాల నేపథ్యంలో హైదరాబాద్ ప్రాముఖ్యత పెరుగుతోందని అన్నారు. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం స్థిరంగా ఉండటమే కాకుండా, వాణిజ్యం , పెట్టుబడులు కూడా వేగంగా వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

### ఈ రోడ్డుకు ఎందుకు ఈ పేరు పెట్టారంటే..

హైదరాబాద్‌లో ఈ రహదారిలోనే గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి ప్రధాన అమెరికన్ దిగ్గజ సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. అందుకే ఈ రోడ్డుకి 'ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు. అమెరికా రాయబారి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన బలమైన, గౌరవప్రదమైన భాగస్వామ్యానికి ఈ చర్య నిదర్శనమని అన్నారు. చారిత్రాత్మకంగా భారతదేశంలో రహదారులకు దివంగతులు మహాత్మాగాంధీ లేదా నెల్సన్ మండేలా వంటి మహనీయుల పేర్లు పెట్టడం చూశాం. అయితే, తెలంగాణ ప్రభుత్వం ఇటీవల గూగుల్, టాటా వంటి ప్రపంచ స్థాయి సంస్థల అధిపతుల పేర్లను రహదారులకు పెట్టే దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ, భారత్‌లో ఇలా గౌరవించబడిన మొదటి అమెరికా అధ్యక్షుడిని తానేనంటూ ట్రూత్ సోషల్ వేదికగా ఆనందం వ్యక్తం చేశారు.

# చారిత్రక సాక్షి.. జొనాథన్


## ఆరోగ్యంగానే 194 ఏళ్ల తాబేలు


హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బొటానికల్ గార్డెన్స్‌కి వెళ్లనున్నారు. షెడ్యూల్ ప్రకారం అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపడుతున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక.. ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును ప్రధాని మోదీ కలుసుకోనున్నారు.

- సీషెల్స్ టూర్‌లో ప్రధాని మోదీ
- అరుదైన తాబేలును వీక్షించే అవకాశం

### 194 ఏళ్ల తాబేలు..

1832లో పుట్టిన తాబేలును ప్రధాని మోదీ వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు దానికి సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్దాలకు చేరుకున్న ఆ తాబేలు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షిగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటర్నరీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే.. వయసు రీత్యా కంటి చూపు మందగించి, వాసన గుర్తుపట్టే గుణాన్ని కొంత కోల్పోయినట్లు డాక్టర్లు తెలిపారు.





# తెలంగాణలో బీజేపీ విజయపతాకం ఎగురవేస్తాం.. ఎంపీ ఈటెల రాజేందర్

- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి: ఈటల రాజేందర్‌లి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటనకు ఘన ఏర్పాట్లు
- ఔషాపూర్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఈటల రాజేందర్
- తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఈటల రాజేందర్ ధీమా
- నితిన్ నబీన్ పర్యటనతో తెలంగాణ బీజేపీకి కొత్త ఉత్సాహం.
- కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై కీలక మార్గదర్శనం చేయనున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు.
- కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు.




**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ ఏదులాబాద్ డివిజన్ పరిధిలోని ఔషాపూర్ గ్రామంలోని రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్ హాల్లో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుల నితిన్ నబీన్ తెలంగాణ పర్యటనలో భాగంగా నిర్వహించనున్న ముఖ్య సమావేశానికి విస్తృత ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఈ ఏర్పాట్లను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తో కలిసి పరిశీలించి అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ శక్తి రోజురోజుకూ బలోపేతం అవుతోందని, రాష్ట్ర ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా భారతీయ జనతా పార్టీ వైపు ఆశగా చూస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికా రంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాక ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొన్నదని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని, అదే స్ఫూర్తితో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటనకు రావడం రాష్ట్ర బీజేపీకి మరింత ఉత్సాహాన్ని తీసుకువస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేస్తూ భవిష్యత్ కార్యాచరణపై కీలక మార్గనిర్దేశం చేయనున్నారని చెప్పారు. తెలంగాణలో బీజేపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్తను ప్రజల మధ్యకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ పర్యటన ఎంతో కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నడిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రం రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుమలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి:-** కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ నిర్వహణను సమగ్రంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, స్వాధీన వాహనాల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేసి కానిస్టేబుల్ బస్వరాజ్‌కు రివార్డు మంజూరు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించి విధి నిర్వహణలో సమర్థత పెంచుకోవాలని సూచించారు. పెండింగ్, మిస్సింగ్ కేసులను ప్రత్యేక కార్యాచరణతో త్వరితగతిన పరిష్కరించాలని, ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాలపై పూర్తి అవగాహనతో ప్రజలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా విధులు నిర్వహించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాకు మంజూరైన 8,953 ఇందిరమ్మ ఇళ్లలో 7,271 ఇళ్లకు (81 శాతం) గ్రౌండింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ఇళ్లను వెంటనే ప్రారంభించి జూలై 15 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వారం దశలవారీగా నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తూ, రోజువారీగా పూర్తవుతున్న ఇళ్లపై నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతిరోజూ పర్యటిస్తూ నిర్మాణాలను పర్యవేక్షించాలని సూచించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న, ఇల్లు నిర్మించుకోలేని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు డీఆర్‌డీఏ ద్వారా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రస్తుతం గుడిసెల్లో నివసించే వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక అధికారులు గ్రామాలు, పట్టణాల్లో గుడిసెల్లో నివసించే వారిని గుర్తించి త్వరితగతిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఏఈలు,తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే బెస్ట్ టీచింగ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో పలు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో అనేంట్ డిజిటల్ సంస్థ సౌజన్యంతో 10 ల్యాప్‌టాప్‌లను,అలాగే 'లయన్స్ క్లబ్ హైదరాబాద్ సౌత్' ఆధ్వర్యంలో 200 భోజనం ప్లేట్లు,నోట్ బుక్స్ విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ హైదరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాలలోని స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చి నారాయణఖేడ్ లాంటి మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవాలన్నారు. డిజిటల్ యుగంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం. అనేంట్ డిజిటల్ సంస్థ ల్యాప్‌టాప్‌లు అందించడం, లయన్స్ క్లబ్ వారు నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు అవసరమైన వస్తువులను పంపిణీ చేయడంతో అడ్మిషన్లు ఎక్కువ కావడంతో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్కూల్ స్టాఫ్,లయన్స్ క్లబ్ బాధ్యులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బి .ఎల్. ఓ. బి.ఎల్.ఏ లకు ప్రజలు పూర్తి సహాకారం అందించాలి :: ఉప సర్పంచ్ రవికుమార్



**వాస్తవ తెలంగాణ న్యూస్ పుల్కల్.** ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఓటర్ సర్వేలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని బి.ఎల్.ఆర్ లకు అవసరమైన వివరాలు అందించి పూర్తి సహకారం అందించాలని ఉపసర్పంచ్ రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు పుల్కల్ మండలం ఇసోజుపేట గ్రామంలో ఇంటింటా జరుగుతున్న సర్వేలో ప్రతి ఓటర్ పాల్గొనాలని బి.ఎల్.ఓ లకు అవసరమైన సమాచారాన్ని సక్రమంగా అందించాలని కోరారు .ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.( సర్ )సర్వేలపై అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ .బి.ఆర్.ఎస్ పార్టీల బిఎల్ఏలు అందుబాటులో ఉన్నారని సందేహాలు ఉంటే వారిని సంప్రదించాలని సూచించారు. ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉపసర్పంచ్ బేగరి రవికుమార్ కోరారు


# బిఎల్ఏలు సర్వే పకడ్బందీగా చేయాలి.. ఖేడ్ సర్ కోఆర్డినేటర్ ఫయీమ్...



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్.** బిఎల్ఏలు సర్వే పకడ్బందీగా చేయాలని నారాయణఖేడ్ సర్ కోఆర్డినేటర్ తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో శనివారం కాంగ్రెస్ లీడర్లతో కలిసి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చినప్పటినుండి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఎనిమిది సార్లు సర్ కార్యక్రమాన్ని నిర్వహించిందని ప్రజలు కచ్చితంగా ఇట్టి అవకాశాన్ని వినియోగించుకొని పూర్తి సమాచారాన్ని బిఎల్ఏ లకు ఇవ్వాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు దాటిన యువతి, యువకులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్ వివేకానంద, కాంగ్రెస్ నాయకులు వినోద్ పాటిల్, రమేష్ చౌహాన్, సుబూర్, గోపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

# బి .ఎల్. ఓ. బి.ఎల్.ఏ లకు ప్రజలు పూర్తి సహాకారం అందించాలి రహీం పాష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

**మేడ్చల్ వాస్తవ తెలంగాణ న్యూస్ :** ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఓటర్ సర్వేలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని బి.ఎల్.ఆర్ లకు అవసరమైన వివరాలు అందించి పూర్తి సహకారం అందించాలని రహీం పాష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు, ఎల్లంపేట మున్సిపాలిటీలోని నూతనకల్ గ్రామంలో ఇంటింటా జరుగుతున్న సర్వేలో ప్రతి ఓటర్ పాల్గొనాలని బి.ఎల్.ఓ లకు అవసరమైన సమాచారాన్ని సక్రమంగా అందించాలని కోరారు, ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.( సర్ )సర్వేలపై అవగాహన కల్పించేందుకు అందుబాటులో ఉన్నారని సందేహాలు ఉంటే వారిని సంప్రదించాలని సూచించారు. ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



# మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రాపురం వాస్తవ తెలంగాణ** రామచంద్రాపురం జీహెచ్ఎంసీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సింధు ఆదర్శ్ రెడ్డి.రామచంద్రాపురం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న చీరలను పంపిణీ చేసి, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్పా నాగేష్ యాదవ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ జ్యోతి, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# డి.వి.జి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం



**ఇంద్రధనస్సు దినపత్రిక శేరిలింగంపల్లి న్యూస్ జూన్ 28** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పిజేఆర్ నగర్ కాలనీ బ్లాక్ నెంబర్ 71లో నివసించే శ్రీనివాస్(52) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. శశిధర్ పట్వారీ, జి.రవి, యాదగిరి, అగ్రవాసు, నాగేశ్వరరావు వాలి, అనిల్ కుమార్, జి నాగేశ్వరరావు, అప్పలనాయుడు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

# గోదావరి అంజిరెడ్డి సమక్షంలో బూత్ స్థాయి నాయకుల సమావేశం



**రామచంద్రపురం వాస్తవ తెలంగాణ న్యూస్** బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ పర్యటన నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో బీఎల్ఏ-2 (బూత్ స్థాయి జిల్లా నాయకులు ఏజెంట్లు) కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి ?పార్టీకి వెన్నుముక లాంటి బూత్ స్థాయి వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ప్రతి బూత్‌లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఓటరు నమోదు ప్రక్రియపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించాం. జాతీయ అధ్యక్షుల పర్యటనను సక్సెస్ చేసేందుకు కార్యకర్తలంతా సంసిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా నేతలకు సూచించాం. ?ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ పత్రి రామకృష్ణ , నూతన ంఎ మోర్చా అధ్యక్షులు చంటి ప్రభు. నూతన ె్ మోర్చా అధ్యక్షులు సుభాష్,నూతన ాదీజ మోర్చా అధ్యక్షులు కోణం విఠల్,ప్రవీణ్ రెడ్డి, బుమన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాపాయ స్థితికి చేరిన యువతికి శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన మెడికవర్ హాస్పిటల్స్ చందానగర్ వైద్యులు



**వాస్తవ తెలంగాణ శేరిలింగంపల్లి న్యూస్ జూన్ 27** తీవ్ర కడుపు నొప్పి, రక్తపోటు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, అధిక అంతర్గత రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో మెడికవర్ హాస్పిటల్స్‌కు చేరిన 34 ఏళ్ల మహిళకు వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. కొన్ని రోజులుగా నెలసరి ఆలస్యం కావడంతో పాటు తీవ్రమైన కడుపు నొప్పి, తీవ్ర నీరసం, అస్వస్థతతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించే సమయానికి ఆమె రక్తపోటు కేవలం 70/40 ఎఎంహ్గ్ మాత్రమే ఉండగా, గుండె స్పందన నిమిషానికి 160 సార్లు నమోదైంది. పరిస్థితి అత్యంత విషమంగా ఉ ండటంతో ఎమర్జెన్సీ వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించి ఐసీయూకు తరలించారు.ద్రవాలు అందించినప్పటికీ రక్తపోటు మెరుగుపడకపోవడంతో ప్రత్యేక ఇనోట్రోప్ మందుల సహాయంతో చికిత్స కొనసాగించారు. ఇదే సమయంలో రోగికి మూర్ఛ లక్షణాలు కనిపించడంతో వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి శ్వాసనాళాన్ని రక్షించారు.తదుపరి నిర్వహించిన పరీక్షల్లో గర్భధారణ నిర్ధారణ కావడంతో పాటు అల్ట్రాసౌండ్‌లో గర్భాశయం వెలుపల పిండం పెరగడం (ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ), ఫెలోపియన్ ట్యూబ్ పగిలిపోవడంతో కడుపులో భారీగా రక్తస్రావం జరిగినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే బ్లడ్ బ్యాంక్‌ను అప్రమత్తం చేసి అత్యవసరంగా రక్తం అందుబాటులోకి తెచ్చి శస్త్రచికిత్స చేపట్టారు.డా. భావ్య, Senior Consultant Obstetrician & Gynecologist, Laparo scopic & Fertility Specialist నేతృత్వంలోని ప్రసూతి ఒ గైనకాలజీ బృందం అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించి పగిలిపోయిన కుడి ఫెలోపియన్ ట్యూబ్‌ను తొలగించారు. కడుపులో పేరుకుపోయిన సుమారు 1.5 నుంచి 2 లీటర్ల రక్తాన్ని తొలగించి రక్తస్రావాన్ని పూర్తిగా నియంత్రించారు.అనంతరం డా. రాజు, Critical Care Department ఆధ్వర్యంలో ఐసీయూలో వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించారు. చికిత్స సమయంలో రోగికి అవసరమైన రక్త భాగాలను అందించడంతో పాటు ఎమర్జెన్సీ మెడిసిన్, క్రిటికల్ కేర్, ప్రసూతి ఒ గైనకాలజీ, అనస్థీషియా, బ్లడ్ బ్యాంక్ మరియు నర్సింగ్ బృందాల సమన్వయంతో సమగ్ర చికిత్స అందించారు.

ఫలితంగా రోగి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి వెంటిలేటర్, ఇనోట్రోప్ మందుల అవసరం లేకుండా కోలుకుని ప్రస్తుతం పూర్తిగా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ అనేది మహిళల ప్రాణాలకు ముప్పు కలిగించే అత్యవసర పరిస్థితి అని తెలిపారు. నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, తలతిరగడం, బలహీనత లేదా అకస్మాత్తుగా రక్తపోటు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో నిర్ధారణ, అత్యవసర శస్త్రచికిత్స మరియు మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమన్వయంతో చికిత్స అందించడం వల్లే ఈ మహిళ ప్రాణాలను కాపాడగలిగామని పేర్కొన్నారు.

# సంగారెడ్డి పట్టణంలోని విద్యాలయాల్లో అభివృద్ధి పనుల కోసం రూ. 5.40కోట్ల టీజీఐఐసీ సీఎస్ఆర్ నిధులు





**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ ్యస్ జూన్ 27** తారా డిగ్రీ కాలేజీలో ప్రహరీ నిర్మాణం కోసం - రూ. 50లక్షలు.నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వం పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో టీజీఐఐసీ నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.5.40కోట్లు అందాయి. నిధులతో ఉ మెన్స్ డిగ్రీ కాలేజీలో రూ. 4కోట్లు వెచ్చించి హాస్టల్ నిర్మించనున్నారు. రూ. 75 లక్షలతో గర్ల్స్ జూనియర్ కాలేజీలో ఆడిటోరియం నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం కోసం రూ. 75 లక్షలు వెచ్చించనున్నారు. తార డిగ్రీ కళాశాలలో ప్రహరీ నిర్మాణం కోసం ఇందులో నుంచి రూ. 50లక్షలు కేటాయించారు. ఈ పనులకు టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్ పర్సన్ కూన వనితా సంతోష్, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు సంగీత మహేష్, సుష్మిత, రవి నాయక్, శ్రీకాంత్ గౌడ్, ప్రీతి, ఎక్స్ అఫీషియో మెంబర్స్ బబ్బు, శివుడు, యశోద, సోహైల్, ఆరిఫ్ లతో పాటు ఉమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ అరుణ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సునీత, తారా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రవీణ, ఎడ్యుకేషనల్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 1 నుంచి చెత్తను వేరు చేసి ఇవ్వాలి

## నాలుగు విభాగాలుగా వ్యర్థాల విభజన తప్పనిసరి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** జిల్లాలో జూలై 1వ తేదీ నుంచి చెత్తను తప్పనిసరిగా నాలుగు విభాగాలుగా వేరు చేసి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘన వ్యర్థాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఇళ్లలో ఉత్పత్తి అయ్యే తడి చెత్తను గ్రీన్ డబ్బాలో, పొడి చెత్తను బ్లూ డబ్బాలో, సానిటరీ వ్యర్థాలను రెడ్ డబ్బాలో, హానికర వ్యర్థాలను బ్లాక్ డబ్బాలో వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్తను వేరు చేయకుండా ఇవ్వకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.హోటళ్లు, హాస్టళ్లు, పరిశ్రమలు, రెస్టారెంట్లు, ధాబాలు, ఆసుపత్రులు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తమ వ్యర్థాలను స్వయంగా నిర్వహించుకోవాలని, దీనిపై ముందస్తుగా సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నాలుగు రంగుల చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్–2026 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ నాగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, ఎంపీడీవోలు, ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుషాయిగూడలో బి ఎల్ ఓ లతో కలిసి సర్వే నిర్వహించిన బొంతు శ్రీదేవి యాదవ్

## కుషాయిగూడ డివిజన్‌లో బి ఎల్ ఓ లతో కలిసి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్






**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్**/మేడ్చల్ జిల్లా కుషాయిగూడ డివిజన్ మాజి కార్పొరేటర్ లిబొంతు శ్రీదేవి యాదవ్‌లిశనివారం డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లలో బి ఎల్ ఓ లతో కలిసి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు.ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల తొలగింపు, అడ్రస్ మార్పులపై బి ఎల్ ఓ లతో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు.

**సర్వేలో పాల్గొన్న బి ఎల్ ఓ లు:** – బూత్–87: బి ఎల్ ఓ శ్రీనివాస్ – బూత్–97: బి ఎల్ ఓ సిరీష – బూత్–89: ఎల్ ఓ రేణుక బి ఎల్ ఏ లు– నీరజ రెడ్డి,రామ రెడ్డి,భాను నేత ల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ “ఓటరు జాబితాలో ఒక్క అర్హుడు కూడా మిస్ కాకూడదు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మా లక్ష్యం. బి ఎల్ ఓ లతో సమన్వయం చేసుకుంటూ 100% ఖచ్చితమైన ఓటరు జాబితా తయారు చేస్తాం” అని అన్నారు. ప్రజలు కూడా తమ ఓటరు కార్డు వివరాలు సరి చూసుకోవాలని, తప్పులుంటే వెంటనే బి ఎల్ ఓ లకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి,డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసుల సతీష్ గౌడ్, యూత్ నాయకులు రాగిడి సాకేత్ గౌడ్ ,హీరాలాల్ నాయక్,భాను,తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధే లక్ష్యం.. ధండమూడి ఎన్‌క్లేవ్ నూతన కమిటీకి బి.ఆర్.ఎస్.ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభినందనలు



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 287వ వార్డు, పేట్‌బషీరాబాద్ పరిధిలోని ధండమూడి ఎన్‌క్లేవ్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు శనివారం బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభినందనలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి



కార్యక్రమాల అమలుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో దండమూడి ఎనక్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం – అధ్యక్షుడు -- శ్రీ కిరణ్ కుమార్, కార్యదర్శి -- శ్రీ వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు – శ్రీ సాయి రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి -- శ్రీ జార్జ్ థామస్, కోశాధికారి -- శ్రీ నాగరాజు పుప్పాల, కార్యవర్గ సభ్యులు శ్రీ వెంకట రమణ, శ్రీ కృష్ణ ప్రసాద్, శ్రీ వాసుదేవ్, శ్రీ విక్రమ్ రావు, శ్రీ ఉదయ భాస్కర్ రావు, శ్రీ తిరుమల్ గౌడ్, శ్రీ అభిలాష్, శ్రీ చిన్నా రెడ్డి, శ్రీమతి సరోజా రెడ్డి, శ్రీమతి జ్యోతి, మరియు కాలనీ పెద్దలు శ్రీ సుధాకర్ రావు, శ్రీ ప్రభాకర్ రెడ్డి ఇంకా సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మచ్చ బొల్లారం మొహారం పండుగా లో పాల్గొన్నా నార్ల సురేష్



**.వాస్తవ తెలంగాణా బొల్లారం /**.మచ్చ బొల్లారంలో మొహరం వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ నర్ల సురేష్ అతిక్ పాషా ఆధ్వర్యంలో జరిగిన మొహరం వేడుకల్లో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన పీర్లను దర్శించుకున్నారు ఈ సందర్భంగా సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ గ్రహీత బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ నర్ల సురేష్ మాట్లాడుతూ మన ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కులమత భేదం లేకుండా అందరూ ఐక్యమత్యంతో అన్ని మతాలవారు తమ పండుగలను ఘనంగా చేసుకోవాలని పండుగలకు ప్రభుత్వం నుండి వచ్చే నిధులను ఇప్పిస్తూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తుంటాడు సమాజంలో శాంతి సామరస్యం సోదర భావం మరింత బలోపేతం కావాలని మొహరం పర్వదినం త్యాగం మానవత్వం ఐక్యతకు ప్రతికగా నిలుస్తుందని అన్ని మతాల ప్రజలు పరస్పర ప్రేమాభిమానాలతో కలిసి జీవించాలని ఈ వేడుకను ముందుండి నడిపించిన అతి పాషా గారిని అభినందిస్తూ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో డోలి రమేష్ మధుసూదన్ రెడ్డి జావిద్ రాజు బషీరుద్దీన్ హరిత శిల్ప బి ఆర్ ఎస్ కార్యకర్తలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు



# డైట్ ప్రిన్సిపాల్ రాధా కిషన్‌కు ఘనంగా ఉద్యోగ విరమణ అభినందన సభ..





**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** మెదక్ జిల్లా డైట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాధా కిషన్ ఉద్యోగ విరమణ సందర్భంగా హవేలీ ఘనపురం మండల పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాచారం మధుమోహన్, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ నాయకులు, డైట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ మాట్లాడుతూ.. డైట్ ప్రిన్సిపాల్‌గా,జిల్లా విద్యాశాఖ అధికారిగా ప్రొఫెసర్ రాధా కిషన్ అందించిన సేవలు అమోఘమని అన్నారు. ఎలాంటి సమస్యనైనా సున్నితంగా పరిష్కరించే నాయకత్వ లక్షణం ఆయన సొంతమని, సమయపాలన, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అందరి మన్ననలు పొందారని కొనియాడారు.ప్రొఫెసర్ రాధా కిషన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి నుంచే తాను ఈ స్థాయికి ఎదిగానని, తన పదవీకాలంలో సహకరించిన విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయ నాయకులు, డైట్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజలు, ఉపాధ్యాయులు తనపై చూపిన ఆదరణను జీవితాంతం మరువనని అన్నారు.ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత గౌరవప్రదమైనదని పేర్కొంటూ, ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను సవాలుగా స్వీకరించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలో మెదక్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు.

# సర్ కార్యక్రమం లో కాప్రా మున్సిపల్ అధికారులు..



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం కాప్రా సర్కిల్లో (ఎస్ ఐ ఆర్) పర్యవేక్షణ లో భాగంగా కుషాయిగూడ ప్రాంతంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మరియు (ఏఈఆర్ఓ)రవీంద్ర సాగర్ పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే మరియు ఫామ్స్ డిస్ట్రిబ్యూషన్, దరఖాస్తు వివరాల సేకరణ పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. సత్వరంగా ఈ యొక్క వివరాల సేకరణ జరగాలని నోడల్ ఆఫీసర్లకు మరియు సూపర్వైజర్లకు ఏఈఆర్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో యూసీడ్ సెక్షన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సురేష్, డి.ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రవి సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ మరియు ఎస్ ఐ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.




# శివాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్



**వాస్తవ తెలంగాణ శేరిలింగంపల్లి న్యూస్** మల్కం చెరువు శివాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్. రాయదుర్గం లోని , మల్కం చెరువు శివాలయం లో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ మహాకాళేశ్వర లింగ సహిత మహా గణపతి సుబ్రమణ్య స్వామి ధ్వజస్తంభ మరియు దంపత నవగ్రహాది ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మాన్ని సంస్కృతిని , ఆధ్యాత్మికతను కాపాడటం మన బాధ్యత అని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సుఖసంతోషాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు, ఈ శివాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులకు, దాతలకు, వేద పండితులకు, సేవకులకు మరియు సహకరించిన ప్రతి భక్తునికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు, ఆ పరమేశ్వరుని, మహా గణపతి స్వామివారి, సుబ్రహ్మణ్య స్వామివారి మరియు నవగ్రహాల అనుగ్రహం ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో చంద్ర శేఖర్ యాదవ్, దయాకర్, నరేందర్ ముదిరాజ్, సంజీవ్, శ్యామ్ యాదవ్,రాజు, శ్రీను, విజయ్ కుమార్,.యువరాజ్, శ్రీనాథ్, ప్రవీణ్, ప్రభాకర్ మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా శంబులింగేశ్వర దేవస్థానం సప్తమ వార్షికోత్సవం





గోమాత పూజ ప్రత్యేక పూజలు హోమాలు వార్షికోత్సవశీ ప్రతి సంవత్సరాశీ గత 8 సంవత్సరాలనుండి నిర్వహిస్తున్నామని తెలిపారు. అదెల్లి కుటుంబ సభ్యుల సహకారంతో దేవాలయం లో అన్ని కార్యక్రమాలు విజయవంతం గా పూర్తిచేసుకుంటున్నామని భక్తులు ప్రతి సంవత్సరశీ పెరుగుతున్నారని తెలిపారు. ఈసందర్భంగా దేవాలయాన్ని బీరంగూడ గ్రామ పెద్దలు రమేష్ గౌడ్ మాకం మల్లేష్ పిర్జపతి సత్యనారాయణ చిన్న వీరేశం పెద్దవీరేశం నక్కల కిష్టయ్య ఎడ్ల జనార్దన్ బంటు శివ ప్రవీణ్ నవీన్ మరియు నాయకులు శ్రవణ్ లక్ష్మణ్ గుప్త గోపాలరెడ్డి తదితరులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నరు. ఈకార్యక్రమంలో అర్చక స్వాములు శ్రవణ్ పంతులు సంబశివారావు విశ్వేశ్వర్ పంతులు నరేష్ పంతులు అదెల్లి కుటుంబ సభ్యులు జైరాములు శంకరప్రసాద్ ఆంజనేయులు రాజు శ్రీధర్,యాదగిరి ప్రభాకర్ చంద్రశేఖర్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**అమీన్ పూర్ వాస్తవ తెలంగాణ న్యూస్** బీరంగూడ భ్రమరాంబ సహిత శంబులింగేశ్వర దేవస్థానం సప్తమ వార్షికోత్సవశీ దేవాలయం ధర్మకార్త శ్రీ శంబులింగేశ్వర సేవాసమితి అధ్యక్షులు అదెల్లి రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. దేవాలయం పూజారులు ఉదయం గోమాత పూజ ప్రత్యేక పూజాకార్యక్రమాలు హోమం మరియు రుద్రభిషేకమ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఘనంగా జరిగాయి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈసందర్భంగాఆలయ ధర్మకర్త శంబులింగేశ్వర శంబులింగేశ్వర సేవ సమితి అధ్యక్షులు అదెల్లి రవీందర్ మాట్లాడుతూ కీర్తి శేషులు అదెల్లి నారాయణ గారు నిర్మించిన దేవాలయం గత 10 సంవత్సరాలనుండి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు విశేషమైన సేవలు అందిస్తూ ప్రాంతం అంత సుబిక్షంగా ఉండాలని ప్రజలు సుఖ శాంతిషాలతో ఉండాలని



# శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో

## పాల్గొన్న అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్





**అమీన్ పూర్ వాస్తవ తెలంగాణ న్యూస్** బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ . ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు.

# సిగాచి సంస్మరణ సభ పోస్టర్‌ను పటాన్ చెరు నియోజకవర్గం ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి

**వాస్తవ తెలంగాణ పటాన్ చెరు న్యూస్** సిగాచి సంస్మరణ సభ పోస్టర్‌ను నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మరియు ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోట సుమలత శ్రీకాంత్ యాదవ్ తో కలిసి ఆవిష్కరించిన పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్.జూన్ 30 న జరగనున్న సిగాచి సంస్మరణ సభకు హాజరు కానున్న మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు.ధ్రూవా చౌరస్తాలోని సభ ప్రాంగణాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు.సిగాచి పరిశ్రమ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల స్మారకార్థం ఈ నెల 30వ తేదీ ఉదయం 10:00 గంటలకు బీపీఎల్ చౌరస్తా, ఇస్నాపూర్‌లో నిర్వహించనున్న సిగాచి బాధితుల సంస్మరణ సభ పోస్టర్‌ను పటాన్ చెరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మరియు ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోట సుమలత శ్రీకాంత్ యాదవ్ తో కలిసి ఆవిష్కరించిన పటాన్ చేరు మండల ఇంచార్జ్, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిగాచి ప్రమాదం దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక విషాదకర ఘటనగా నిలిచిపోయిందన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు నివాళు లర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.సిగాచి



బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించడంతో పాటు, కుటుంబ సభ్యులకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సంస్మరణ సభకు తెలంగాణ మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలియజేయాలనుకునే ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్మక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని గడీల శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య ,బీఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్ ,ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్స్ మచ్చ కిషోర్ రెడ్డి ,బూరిగారి నరేందర్ రెడ్డి ,వడ్డే గడ్డ రాజు ,గొంగోళ్ల నవీన్ రెడ్డి ,పెలిమెల వెంకటేష్ ,కో ఆప్షన్ సభ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి ,బండ రాజు ,ఐలాపూర్ మాణిక్ యాదవ్ ,పాశంమైలారం గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్,స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


# మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి వాస్తవ తెలంగాణ** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ప్జీ= నగర్ లో రెండు కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను నాణ్యతప్రమానాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుంది అని, అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్ ను అన్ని హంగుల తో సకల సౌకర్యాల తో నిర్మిస్తామని మాజీ కార్పొరేటర్ తెలియచేసారు. ఫంక్షన్ హాల్ పేద మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలియచేసారు. ఫంక్షన్ హల్ లో వివాహాది శుభకార్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుంది అని అన్నారు. ఫంక్షన్ హాల్ మరియు చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శశిధర్ పట్వారీ, జి.రవి, యాదగిరి, అగ్రవాసు, వాలి నాగేశ్వరరావు, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# బీరంగూడ మారుతి నగర్ కాలనీలో ఘనంగా శ్రీ లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

**వాస్తవ తెలంగాణ** పటాన్ చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ, ధ్వజ స్తంభం ప్రతిష్టాపనల కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# పురుగులు పట్టిన చికెన్ కలకలం..! పేట్ బషీరాబాద్ కేఎఫ్సీపై వినియోగదారుల ఫిర్యాదు

- ‘బై వన్--గెట్ వన్’ ఆఫర్‌లో కొనుగోలు చేసిన చికెన్‌లో పురుగులున్నాయని బాధితుల ఆరోపణ
- కుటుంబ సభ్యులు తిన్న తర్వాత విషయం గుర్తించామని నరేష్, సునీల్ వాదన
- పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదని ఆరోపణ
- సీసీటీవీ ఫుటేజ్, ఆహార నమూనాలను స్వాధీనం చేసుకుని నిష్పక్షపాత విచారణ చేపట్టాలని విజ్ఞప్తి
- ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలు నిర్ధారించాలని డిమాండ్
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి








**పేట్ బషీరాబాద్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు......** పేట్ బషీరాబాద్‌లోని కేఎఫ్సీ అవుట్‌లెట్‌లో కొనుగోలు చేసిన చికెన్‌లో పురుగులు ఉన్నాయని ఆరోపిస్తూ ఇద్దరు వినియోగదారులు నరేష్, సునీల్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. బాధితులు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. శుక్రవారం కేఎఫ్సీలో నిర్వహించిన ‘బై వన్--గెట్ వన్’ ఆఫర్‌లో భాగంగా చెరో రూ.450 చొప్పున మొత్తం రూ.900 చెల్లించి చికెన్ కొనుగోలు చేశారు. ఇంటికి తీసుకెళ్లిన అనంతరం ప్యాకెట్ తెరిచి చూడగా చికెన్ నుంచి దుర్వాసన వస్తుండటంతో పాటు అందులో పురుగులు కనిపించాయని వారు ఆరోపించారు. అప్పటికే కుటుంబ సభ్యులు, చిన్నారులు కొంతమేర ఆ చికెన్ తినడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యామని నరేష్ తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని కేఎఫ్సీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా తమకు తగిన స్పందన రాలేదని ఆయన ఆరోపించారు. అనంతరం అదే రాత్రి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని బాధితులు ఆరోపించారు. ఫిర్యాదు స్వీకరించిన సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ “మేము ఫోన్ చేసినప్పుడు పురుగులు పట్టిన చికెన్ తీసుకురండి” అని చెప్పి పంపించేశారని నరేష్ పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే ఆహార నమూనాను స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, తాము ఫిర్యాదు చేసిన అనంతరం కేఎఫ్సీ నిర్వాహకులు కూడా తమపై ఎదురుగా ఫిర్యాదు చేసినట్లు పోలీసుల ద్వారా తెలిసిందని బాధితులు తెలిపారు. ఆ ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన సమయంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకుని, అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను పరిశీలిస్తూ నిష్పక్షపాత విచారణ చేపట్టాలని బాధితులు కోరారు. అలాగే సంబంధిత ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించాలని, ఫుడ్ సేఫ్టీ అధికారులు అవుట్‌లెట్‌లో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పోలీసు అధికారులు తమ ఫిర్యాదుపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, కేసు నమోదు అంశంపై స్పష్టత ఇవ్వడంతో పాటు నిష్పక్షపాత విచారణ నిర్వహించాలని బాధితులు కోరారు.

# గేటెడ్ కమ్యూనిటీల భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి

**బాచుపల్లి పరిధిలో సెక్యూరిటీ సంస్థలతో డీసీపీ సమన్వయ సమావేశం**
**-పోలీస్--ప్రైవేట్ సెక్యూరిటీ మధ్య సమన్వయం పెంచాలని సూచన**
**-నేపథ్య పరిశీలన పూర్తైన సిబ్బందినే విధుల్లో నియమించాలని ఆదేశం**
**-అనుమానాస్పద ఘటనలు వెంటనే డయల్--100కు తెలియజేయాలని సూచన**
**-సీసీటీవీ నిఘా, విజిటర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి**
**-సెక్యూరిటీ గార్డులకు నిరంతర శిక్షణ నిర్వహించాలని సూచనలు**
**-కండ్లకోయ సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో సమావేశం నిర్వహణ**





**బాచుపల్లి, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు..** గేటెడ్ కమ్యూనిటీల భద్రతను మరింత పటిష్టం చేయడం, ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలు--స్థానిక పోలీసుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సెక్యూరిటీ సంస్థల ప్రతినిధులు, సెక్యూరిటీ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) అధ్యక్షతన శనివారం కండ్లకోయలోని సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో జరిగిన ఈ సమావేశంలో భద్రతా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, గేటెడ్ కమ్యూనిటీల్లో విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బంది నేరాల నివారణలో తొలి రక్షణ కవచంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్--100కు సమాచారం అందించాలని సూచించారు. విధుల్లో నియమించే ప్రతి సెక్యూరిటీ గార్డుకు అర్హతలు, పూర్తి స్థాయి బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్, పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వారి గుర్తింపు పత్రాలు, ఫోటోలు, చిరునామా, ఉద్యోగ వివరాలను సక్రమంగా నిర్వహించాలని సెక్యూరిటీ సంస్థలకు సూచించారు. ఇటీవలి కొన్ని సంఘటనల నేపథ్యంలో నేపాలీ సెక్యూరిటీ గార్డుల నియామకంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వారి గుర్తింపు, చిరునామా ధృవీకరణతో పాటు అవసరమైన అన్ని పత్రాలను పరిశీలించిన అనంతరమే విధుల్లో నియమించాలని ఆదేశించారు. అదేవిధంగా, గేటెడ్ కమ్యూనిటీల్లో సీసీటీవీ నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, క్రమం తప్పకుండా సెక్యూరిటీ ఆడిట్లు నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానంపై సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, విజిటర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడం, భద్రతా రికార్డులను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో కుత్బుల్లాపూర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బాలగంగి రెడ్డి, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సి. సతీష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సురేష్‌తో పాటు వివిధ ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థల ప్రతినిధులు, గేటెడ్ కమ్యూనిటీల సెక్యూరిటీ మేనేజర్లు పాల్గొన్నారు.

# కీసర లోని అసైన్డ్ భూమిని కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి:- కాంగ్రెస్ నాయకుడు బూడిద ప్రేమ్ కుమార్




**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ కీసర మండల రెవెన్యూ పరిధిలోని కీసరలో సర్వే నంబర్ 395, 396 లో సుమారు అయిదు ఎకరాల అసైన్డ్ భూమిలో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి అమ్ముకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు బూడిద ప్రేమ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ అసైన్డ్ భూములను పీ ఓటీ కింద జప్తు చేసుకుని ప్రజా అవసరాలకు ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్డీవో, ఎమ్మార్వో లను వేడుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి కుంటోళ్ళ యాదగిరి అనే వ్యక్తి అసైన్డ్ భూములపై కన్నేసి కబ్జా చేసి వ్యాపారం చేసి అధిక మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారని యువజన కాంగ్రెస్ విభాగం నాయకులు ఆరోపిస్తున్నారు. అదే స్థలంలో కాళికాదేవి దేవాలయ నిర్మాణం జరిగితే ఆ నిర్మాణాలను అడ్డుకుని దేవాలయాన్ని తొలగించి ఆ స్థలాన్ని కూడా అమ్ముకునే ప్రయత్నంలో ఆలయంలో నివాసమున్న వారిపై కూడా దౌర్జన్యానికి దిగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇట్టివారిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని బూడిద ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు.


# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదల సొంతింటి కల సహకారం మండల అధ్యక్షుడు నత్తి దశరథ్





**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి జూన్ 27** సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట్ లో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం సందర్భంగా చాపల శక్కులాల్ దంపతుల గృహప్రవేశం శనివారం చేయగా గృహ ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథిగా చౌటకూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్ గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి వారి చేతుల మీదుగా గృహప్రవేశం చేయించారు ఈ సందర్భంగా నత్తి దశరథ్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటని అందులో అర్హులైన నిరుపేద లందరికీ ఇందిరమ్మ గృహాలు ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్రంలో ఇల్లు లేక నిరుపేదలు ఉండకూడదని ఏకైక లక్ష్యంతో ఇందిరమ్మ గృహ పథకం ద్వారా న్యాయం జరుగుతుందని ఇందుకు నిదర్శనమే ఇందిరమ్మ ఇండ్లు అన్ని వర్గాల ప్రజలకు అందిస్తుందని ప్రజలకు అండగా ఉండడమే కాకుండా చేయూతనిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడం జరుగుతుందని ప్రజా పాలనలో అందరికీ న్యాయం జరుగుతుంది అన్నారు ఆందోల్ ఎమ్మెల్యే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ శివంపేట్ కొర్పోల్ లింగంపల్లి 16 కోట్లు బీటీ రోడ్లు కోసం మంజూరు చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ కు కృతజ్ఞతలు తెలిపారు అనంతరం తమ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులకు చాపల శక్కులాల్ దంపతులు శాలువాతో ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్యారాణి మల్లికార్జున్ గౌడ్ ఉప సర్పంచ్ నత్తి సందీప్ కుమార్ మండల నాయకులు ఈశ్వర్ గౌడ్ చెక్రియల్ సర్పంచ్ అనసూయ రాజశేఖర్ గంగోజిపేట్ సర్పంచ్ సునీత అశోక్ బాలా గౌడ్ లింగంపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి కొర్పోల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సారా సంజయ్ మహిపాల్ రెడ్డి యువత అధ్యక్షుడు కాశీనాథ్ ఆలయ చైర్మన్ భానూరి లక్ష్మణ్ శ్రీకాంత్ శివరాజ్ అజయ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# సర్ కు ప్రజలు సహకరించాలి ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి..



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని తొమ్మిదవ వార్డులో నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కార్యములో ఎమ్మెల్యే సంజీవరెడ్డి నాయకులతో కలిసి పాల్గొని మాట్లాడారు. వార్డులో జరుగుతున్న సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించి, అధికారులకు, బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. గతంలో ఓటు ఉండి, జాబితాలో పేర్లు తొలగిపోవడం లేదా తప్పులు దొర్లడం వంటి సమస్యలు ఉంటే ఈ సర్వే ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారుల ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన వారిని గుర్తించి, ఎలాంటి తప్పులు లేని పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించాలి. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సుభుర్, మైతాబ్, రుక్మిణి గోపాల్ రెడ్డి,బి.రాజు,వివేకానంద, వినోద్ పాటిల్,పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, రమేష్ చౌహాన్,స్థానిక బీఎల్ఓలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794